తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
15 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 306
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

- రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు
- తెలంగాణ రైజింగ్ 2.0కు ఆమోదం
- సన్న ధాన్యానికి బోనస్.. ఈవీ ఆటోలకు సబ్సిడీ
- యంగ్ ఇండియా స్కూళ్లు, సాగునీటి ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, ఆగస్టు 14 : రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలను ఆమోదించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం

➤ మిగతా 2వ పేజిలో..

## భారత్ సహనాన్ని బలహీనతగా భావించవద్దు



**ఆపరేషఫన్ సిందూర్ ఇంటర్వ్యూలో అజితో దోభాల్**

న్యూఢిల్లీ,ఆగస్ట్14: భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌పై డిస్కవరీలో త్వరలో ప్రసారం కానున్న డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ఆయన

➤ మిగతా 2వ పేజిలో..



## గోదావరి పుష్కరాలకు ఘన ఏర్పాట్లు

- 2027 పుష్కరాలకు ముందస్తు కార్యాచరణ
- భక్తులకు అన్ని సౌకర్యాల కల్పన
- రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు
- 67 పుష్కర కేంద్రాల అభివృద్ధి లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 14 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న

➤ మిగతా 2వ పేజిలో..

## విద్యార్థులకు ముందస్తు ఫీజు రీయింబర్స్‌మెంట్



- విద్యార్థుల ఖాతాల్లో ఏటా రూ.2,400 కోట్లు
- అడగకుండానే ఖాతాల్లో జమ చేసే విధానం
- సాంకేతిక నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి
- క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలు, నగదు బహుమతులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 14 విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఇకపై ప్రతి విద్యా సంవత్సరం ముందుగానే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ప్రత్యేకంగా ప్రభుత్వాన్ని కోరాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన విద్యార్థుల ఖాతాల్లో ముందుగానే నిధులు అందుబాటులో ఉంచే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. నెక్లెస్ రోడ్‌లోని హెచ్‌ఎండీఏ మైదానం ఎదురుగా జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను శుక్రవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, సామాజిక సమానత్వంపై పలు కీలక అంశాలను వెల్లడించారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో

➤ మిగతా 2వ పేజిలో..

## పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరణ

- నెక్లెస్ రోడ్డులో విగ్రహాలను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- మహనీయులకు పుష్పాంజలి ఘటించిన రేవంత్‌రెడ్డి
- సామాజిక సంస్కరణలకు పూలే దంపతుల సేవలు చిరస్మరణీయం



హైదరాబాద్, ఆగస్టు 14 సామాజిక సంస్కర్తలు, విద్యా ప్రదాతలు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. నెక్లెస్

➤ మిగతా 2వ పేజిలో..



## రాజ్యాంగాన్ని గౌరవించాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- అంబేద్కర్ ఆశయాలను గుర్తుంచుకోవాలి
- వందేమాతరం గీతానికి గౌరవం ఇవ్వాలి
- దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- సమగ్ర అభివృద్ధితో వికసిత భారత్ లక్ష్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 14 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం జాతినుద్దేశించి ప్రసంగించారు. దేశ ప్రజలకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఆమె.. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలని పిలుపునిచ్చారు. న్యాయ వ్యవస్థ, చట్టసభల పట్ల


➤ మిగతా 2వ పేజిలో..

## మైనారిటీల బుజ్జగింపే కాంగ్రెస్ లక్ష్యమా?

- సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం
- ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న ప్రభుత్వం
- హైడ్రా చర్యలపై ప్రశ్నల వర్షం
- ఓటు బ్యాంకు రాజకీయాల ఆరోపణ

హైదరాబాద్, ఆగస్టు 14 పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం

➤ మిగతా 2వ పేజిలో..



## విద్యార్థులకు ముందస్తు ఫీజు రీయింబర్స్‌మెంట్

విద్యార్థుల ధ్రువపత్రాలను విద్యాసంస్థల యాజమాన్యాలు నిలిపివేయడానికి వీల్లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులు అడగకుండానే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వారి ఖాతాల్లో జమ చేసేలా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ముందస్తు చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి ఏడాది సుమారు రూ.2,400 కోట్లను విద్యార్థుల ఖాతాల్లో జమ చేసి పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. గతంలో ఇంజినీరింగ్, వైద్య విద్య వంటి పట్టాలు ఉంటే ఉద్యోగ అవకాశాలు సులభంగా లభించేవని, ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని అన్నారు. కేవలం విద్యార్హతలతో కాకుండా నైపుణ్యాలు ఉన్నవారికే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తున్నాయని పేర్కొన్నారు. నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు నాణ్యమైన విద్యతో పాటు ఆ తర్వాత విద్యార్థులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. పారిశ్రామిక శిక్షణ సంస్థలు, పాలిటెక్నిక్ కళాశాలలు, నైపుణ్య విశ్వవిద్యాలయం ద్వారా యువతకు ఆధునిక శిక్షణ అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నర్సింగ్ వంటి కోర్సులు పూర్తి చేసిన యువతకు విదేశాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు తమలో ఉన్న ప్రత్యేక ప్రతిభను గుర్తించి దానికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు, సాంకేతిక రంగం, సృజనాత్మకత తదితర రంగాల్లో ప్రతిభ చూపేవారికి కూడా సమాన అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

క్రీడల్లో ప్రతిభ చూపే యువతను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. నిఖత్ జరీన్, సిరాజ్, దీప్తి దివాంజీ వంటి క్రీడాకారులను ఉదాహరణగా ప్రస్తావిస్తూ యువత క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక మార్పుల ప్రభావంతో కొన్ని ఉద్యోగాలకు భవిష్యత్తులో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు విద్యార్థులు నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. సామాజిక అసమానతలను తగ్గించడంతో పాటు అన్ని వర్గాల విద్యార్థులు కలిసి చదువుకునే వాతావరణాన్ని కల్పించేందుకు యంగ్ ఇండియా సమగ్ర గురుకుల పాఠశాలల విధానాన్ని అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే వంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం కాదని, వారి జీవితాలు, త్యాగాలు, సామాజిక సేవల నుంచి భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందాలన్నదే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజహరుద్దీన్, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సలహాదారులు పాల్గొన్నారు.

## పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరణ

రోడ్డులోని హెచ్ఎండీఏ మైదానాల ఎదురుగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి పూలే దంపతులకు పుష్పాంజలి ఘటించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యా విస్తరణ కోసం జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతులు చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేశారు. ముఖ్యంగా బాలికల విద్యకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పూలే దంపతులు సాగించిన ఉద్యమం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. సావిత్రీబాయి పూలే మహిళల విద్య కోసం విశేషంగా కృషి చేసి అనేక అవరోధాలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమనే నమ్మకంతో పూలే దంపతులు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. వారి ఆశయాలు, సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసేలా విగ్రహాలను ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. నెక్లెస్ రోడ్డులో ప్రముఖ ప్రదేశంలో విగ్రహాలను ఏర్పాటు చేయడంతో నగరానికి వచ్చే ప్రజలు పూలే దంపతుల సేవలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్య వంటి విలువలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పూలే దంపతుల సేవలను స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పించారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పలువురు పేర్కొన్నారు. సామాజిక సంస్కరణ, విద్యా రంగాల్లో పూలే దంపతులు చూపిన మార్గం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలిపారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం వంటి విలువలను బలోపేతం చేయడంలో వారి ఆలోచనలు కీలకమని పేర్కొన్నారు. పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణతో హైదరాబాద్‌లో మరో ముఖ్యమైన స్మారక స్థలం అందుబాటులోకి వచ్చింది.

## మైనారిటీల బుజ్జగింపే కాంగ్రెస్ లక్ష్యమా?

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రత్యేక వర్గాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన ఆయన, ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం వ్యాఖ్యానించినట్లు పేర్కొంటూ రాంచందర్ రావు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చట్టాలు, నిబంధనలను అందరికీ ఒకే విధంగా అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉందని, కొందరికి ఒకలా మరికొందరికి మరోలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు.

రాష్ట్రంలో హైడ్రా చర్యల పేరుతో పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్న సందర్భాల్లో ప్రభుత్వం ఎలాంటి సానుభూతి చూపడం లేదని ఆయన ఆరోపించారు. నిబంధనల ఉల్లంఘన పేరుతో చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, విద్యుత్ బిల్లులు చెల్లించని వారిపై మాత్రం సానుకూల వైఖరి అవలంబించడం ఎందుకని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు సామాన్య ప్రజలపై కఠిన చర్యలు తీసుకుంటూ, మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు చెల్లించకపోవడాన్ని సమర్థించేలా మాట్లాడటం కాంగ్రెస్ రాజకీయ స్వభావాన్ని ప్రతిబింబిస్తోందని రాంచందర్ రావు అన్నారు. ప్రజల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు.

హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని ఆయన విమర్శించారు. గతం నుంచి ఇప్పటి వరకు అదే రాజకీయ విధానాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సమాజంలో విభజనలను ప్రోత్సహించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో మతం, వర్గం అనే తేడాలు లేకుండా వ్యవహరించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించే విధంగా పాలన సాగించాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా చూసే విధానమే రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## రాజ్యాంగాన్ని గౌరవించాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

గౌరవభావంతో వ్యవహరించాలని సూచిస్తూ, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు.స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా త్రివర్ణ పతాకం రెపరెపలాడనుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం లభించిందని గుర్తుచేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యులు, రైతులు సహా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రజలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర ఉద్యమాన్ని రాష్ట్రపతి స్మరించుకున్నారు. దేశ నిర్మాణంలో సామాజిక సంస్కరణలు, సమానత్వం, న్యాయం వంటి విలువలకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన సేవలను గుర్తుచేశారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొంటూ, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. దేశ స్వాతంత్ర, పురోగతికి కృషి చేసిన మహనీయులందరికీ గౌరవం తెలియజేశారు.దేశ విభజన సమయంలో చోటుచేసుకున్న విషాద ఘటనలను కూడా రాష్ట్రపతి ప్రస్తావించారు. మతపరమైన హింస కారణంగా లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను విడిచిపెట్టి శరణార్థులుగా మారాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఆ కష్టాలను ఎదుర్కొన్న ప్రజల ధైర్యం, పట్టుదలను స్మరించుకోవాలని అన్నారు. దేశ ఐక్యత, సామాజిక సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.ప్రజల ఆశయాలను చట్టసభల్లో ప్రతిబింబించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని రాష్ట్రపతి తెలిపారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విధానాలను రూపొందించడం, చట్టాలను సమర్థంగా అమలు చేయడం, ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థలోని అన్ని విభాగాల బాధ్యత అని పేర్కొన్నారు. గత దశాబ్దంలో దేశం సమ్మిళిత వృద్ధి దిశగా గణనీయమైన పురోగతి సాధించిందని, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల సేవలను కూడా రాష్ట్రపతి ప్రస్తావించారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం వారు చేసిన కృషి చరిత్రాత్మకమని పేర్కొన్నారు. దేశ పురోగతిలో ప్రతి పౌరుడు తన ప్రాథమిక బాధ్యతలను నిర్వర్తిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర స్ఫూర్తితో దేశాన్ని మరింత బలమైన, సమగ్ర, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

## రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు కుటుంబ సభ్యుల పేర్ల నమోదుతో అదనంగా 62 లక్షల మందికి లబ్ధి చేకూరిందని, ప్రస్తుతం రాష్ట్రంలో 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారని వెల్లడించింది. వీరందరికీ స్మార్ట్ కార్డులు అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. గత ఏడాది విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ సదస్సు తరహాలో ఈ ఏడాది 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సదస్సును 'ఇన్వెస్ట్ తెలంగాణ' అంశంతో నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ ప్రణాళిక ఆవిష్కరణతో పాటు రక్షణ, అంతరిక్ష, ఔషధ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక ప్రదర్శనలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.వ్యవసాయ రంగానికి సంబంధించి వానాకాలంలో ఏడు రకాల సన్న ధాన్యాల సాగును ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయించింది. గ్రామపంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించింది. ఈ ఏడాది నుంచి గుర్తించిన ఏడు రకాల సన్న ధాన్యాలకు మాత్రమే క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. అలాగే యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన మిగులు ధాన్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు ఆమోదం తెలిపింది. నైపుణ్యాభివృద్ధి రంగంలో కీలక మార్పులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. అదేవిధంగా ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు 86 పాఠశాలలకు అనుమతులు మంజూరైనట్లు వెల్లడించింది.హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు పెట్రోల్, డీజిల్ ఆటోలను విద్యుత్ ఆటోలుగా మార్చే ప్రత్యేక పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల వ్యయంతో అమలయ్యే ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ అందించనున్నారు. పాత ఆటోలకు విద్యుత్ కిట్ అమర్చుకోవడం లేదా కొత్త విద్యుత్ ఆటోలు కొనుగోలు చేసేందుకు ఈ సాయం ఉపయోగపడనుంది. అలాగే నగరంలోని కాలుష్యకారక పరిశ్రమల తరలింపుకు సంబంధించిన హెచ్ఐఎల్టీ విధానం దరఖాస్తుల గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించింది. సాగునీరు, విద్యుత్ రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు రూ.2,100 కోట్ల అంచనా వ్యయాన్ని ఆమోదించింది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికీ కేబినెట్ అనుమతి మంజూరు చేసింది.

## గోదావరి పుష్కరాలకు ఘన ఏర్పాట్లు

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. గోదావరి నది తీరం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లేలా, దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన కీలక సమావేశంలో పుష్కరాల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.పుష్కరాల సందర్భంగా ఘాట్ల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని మంత్రుల బృందం సూచించింది. పుష్కరాల ప్రారంభానికి ముందే అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేసి భక్తులకు ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇందుకోసం దేవాదాయ శాఖ, రహదారులు భవనాల శాఖ, నీటిపారుదల, పోలీసు, పర్యాటక, వైద్యారోగ్య తదితర శాఖల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేసింది. గోదావరి నది తీరంలోని నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 67 పుష్కర కేంద్రాలను మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఈ పనుల కోసం సుమారు రూ.1000 కోట్ల వ్యయంతో వివిధ శాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఘాట్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు.

పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. అవసరమైతే వర్చువల్ సమావేశాల ద్వారా పనులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని పేర్కొన్నారు. శాఖల వారీగా జరుగుతున్న పనుల వివరాలు, పురోగతిని ప్రతిబింబించే ప్రత్యేక డ్యాష్‌బోర్డును రూపొందించాలని కూడా అధికారులకు సూచించారు.

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పుష్కర క్షేత్రాల చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను తెలియజేసేలా స్వాగత ద్వారాలు, సమాచార బోర్డులు, ప్రత్యేక అలంకరణలు ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు క్షేత్రాల ప్రాముఖ్యతను తెలియజేసే దృశ్య ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు గోదావరి జలాల్లో కలవకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్, రవాణా, పార్కింగ్, తాత్కాలిక బస్ స్టేషన్లు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులు సూచించారు. భద్రాచలం, ధర్మపురి వంటి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాల్లో ముందస్తుగా అన్ని సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల కాలంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గోదావరి పుష్కరాలను రాష్ట్ర చరిత్రలో

## చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు అమృత్ భారత్ రైలు

**మరో ఏడు రైళ్లకు రైల్వేశాఖ ఆమోదం**

**తెలంగాణకు దక్కిన కీలక సర్వీసు**

**కాజీపేట, పెద్దపల్లి మీదుగా రాకపోకలు**

న్యూఢిల్లీ, ఆగస్టు 14 రైల్వే ప్రయాణికులకు శుభవార్త. దేశవ్యాప్తంగా మరో ఏడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ ఆమోదం తెలిపింది. దూర ప్రాంతాలను అనుసంధానిస్తూ తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ రైళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. కొత్త రైళ్లతో దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య రైలు రాకపోకలు మరింత మెరుగుపడనున్నాయి.కొత్తగా ఆమోదించిన ఏడు రైళ్లలో తెలంగాణకు ఒక సర్వీసు కేటాయించారు. చర్లపల్లి నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ వరకు ఈ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నడవనుంది. తెలంగాణలోని కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల మీదుగా ఈ రైలు ప్రయాణించనుంది. అనంతరం బల్హార్షా, నాగ్‌పూర్, భోపాల్ తదితర ప్రాంతాలను కలుపుతూ గోరఖ్‌పూర్‌కు చేరుకోనుంది. దీంతో తెలంగాణ నుంచి ఉత్తరప్రదేశ్‌కు వెళ్లే ప్రయాణికులకు అదనపు రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది.మరో రైలును జార్ఖండ్‌లోని ధన్‌బాద్ నుంచి తమిళనాడులోని కోయంబత్తూర్ వరకు నడపనున్నారు. ప్రయాగ్‌రాజ్ నుంచి ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ వరకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసును అందుబాటులోకి తీసుకురానున్నారు. సుబేదార్‌గంజ్ నుంచి లోకమాన్య తిలక్ టెర్మినస్ వరకు మరో రైలును నడపాలని నిర్ణయించారు.గోరఖ్‌పూర్ నుంచి ఢిల్లీకి మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడపనున్నారు. ఇది బస్తీ, గోండా, బుర్వాల్, బరేలీ తదితర ప్రాంతాల మీదుగా ప్రయాణించనుంది. గోరఖ్‌పూర్ నుంచి బాంద్రాకు మరో రైలును అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ రైలు ఉత్తరప్రదేశ్ నుంచి ముంబైకి వెళ్లే ప్రయాణికులకు ఉపయోగపడనుంది. ప్రయాగ్‌రాజ్ నుంచి ఉద్నా వరకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడపనున్నారు.చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ కేటాయించడం తెలంగాణ ప్రయాణికులకు ప్రయోజనకరంగా మారనుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌తో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అదనపు రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది. తక్కువ ధరలో మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించడమే అమృత్ భారత్ రైళ్ల ప్రధాన ఉద్దేశంగా రైల్వేశాఖ పేర్కొంది.

THARANGALU DAILY NEWS
శనివారం, 15 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆక్సిజన్ మిషన్ అందజేసిన బీర్ల అనిత



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సీ ఆగస్టు 14 తరంగాలు** గుండాల మండలం కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన తండ్ర పరుశురాములు సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వారి సతీమణి,బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత మానవతా దృక్పథంతో స్పందించారు.అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు అత్యవసరంగా అవసరమైన సుమారు రూ.25 వేల విలువైన ఆక్సిజన్ మిషన్‌ను బీర్ల అనిత అందజేశారు.ఈ సందర్భంగా పరుశురాములు మాట్లాడుతూ తన సతీమణి అనారోగ్య పరిస్థితిని అర్థం చేసుకుని ఆక్సిజన్ మిషన్ అందజేసిన బీర్ల అయిలయ్య,అనిత కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.వారి సహాయం తమ కుటుంబానికి ఎంతో అండగా నిలిచిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తుందని,ప్రజలకు ఎప్పుడు, ఎక్కడ ఆపద వచ్చినా వారికి అండగా నిలిచేందుకు ముందుంటుందని తెలిపారు.ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయం అందించడం ద్వారా వారి కష్టాల్లో భాగస్వామ్యం కావడమే బీర్ల ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ,అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న బీర్ల ఫౌండేషన్‌పై పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు.

## గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సీ ఆగస్టు 14 తరంగాలు** వలిగొండ మండల పరిధిలోని గోకారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం డి సి పి యు ఆధ్వర్యంలో పి ఓ సి ఎస్ ఓ చట్టం బాలల హక్కులు, బాలల రక్షణ మరియు బాల్యవివాహాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి మాట్లాడుతూ పిల్లల పైన లైంగిక వేధింపులు జరిగినట్లయితే పి ఓ సి ఎస్ ఓ చట్టం క్రింద కేసులు నమోదు చేస్తారు సమాజంలో ప్రస్తుతం పిల్లల పైన అత్యాచారాలు ఎక్కువ జరుగుతున్నాయి కావున శిక్షలు కఠినంగా ఉన్నాయి అని తెలిపారు.అదేవిధంగా చైల్డ్ లేబర్ బాల కార్మిక వ్యవస్థ, మాదకద్రవ్యాల డ్రగ్స్ దుష్ప్రభావాలు,గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అలాగే చైల్డ్ హెల్ప్‌లైన్--1098 సేవల గురించి వివరిస్తూ, పిల్లలకు సంబంధించిన సమస్యలు లేదా అత్యవసర పరిస్థితుల్లో 1098కు సమాచారం అందించవచ్చని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు స్కోప్ సంస్థ ఎన్జీవో ప్రతినిధి బి. నరసింహ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దేశభక్తి జాతీయ భావాలను పెంపొందించాలి

జి.నవీన్ రెడ్డి



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 15,(తరంగాలు):** విద్యార్థుల్లో దేశభక్తి దేశం పట్ల అభిమానం ప్రేమ సహనం విశ్వసనీయత ఉండాలని 80 వ స్వాతంత్ర దినోత్సవ పురస్కరించుకొని ఒకరోజు ముందుగానే వీ క్యాన్ డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తిడుగు ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేశ స్వాతంత్రం గురించి పోరాడిన మహనీయుల గురించి వారి నాయకత్వ లక్షణాల గురించి ఉపన్యాస పోటీని నిర్వహించడం జరిగింది.ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వాహకులు జి నరేష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థుల్లో జాతీయ భావాలు కుటుంబము గ్రామము రాష్ట్రము దేశం పట్ల అభిమానం చూడగొనాలని ఈ దేశం నాకేమిచ్చింది కాదు ఈ దేశానికి నేనేమీ ఇచ్చిన ఆలోచన ఉన్నత పాఠశాల నుండే ప్రారంభం కావాలని వారు పిల్లలను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు జి నవీన్ రెడ్డి, సదానందం, డాక్టర్ కుందూరు సుధాకర్, నిర్వాహకులు సాధన లేని పవన్ కుమార్, శీరంశెట్టి శ్రీనివాస్, అశ్వర్థ రాజు,నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మత్స్యగిరి దేవస్థానంలో పలు లైసెన్స్ హక్కులకు వేలం

- ఆగస్టు 18న సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం.. 2026--27 సంవత్సరానికి హక్కుల కేటాయింపు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి తరంగాలు** వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 2026--27 సంవత్సరానికి సంబంధించిన పలు లైసెన్స్ హక్కుల కోసం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు ప్రకటించారు.దేవస్థానం ఆధ్వర్యంలో ఇప్పటికే పలు లైసెన్స్ హక్కులకు సంబంధించి వేలం ప్రక్రియ నిర్వహించేందుకు తేదీలు నిర్ణయించినప్పటికీ, వివిధ కారణాలతో వాయిదా పడింది. తాజాగా వాయిదా పడిన వేలాన్ని ఆగస్టు 18న మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలో ఉన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.మూడు లైసెన్స్ హక్కులకు వేలం తాజా ప్రకటనలో 2026--27 సంవత్సరానికి మూడు లైసెన్స్ హక్కులను సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ హక్కుల కాలపరిమితి 20 ఆగస్టు 2026 నుంచి 19 ఆగస్టు 2027 వరకు ఉంటుంది.వేలంలో వాహన పూజా సామగ్రి అమ్మకానికి సంబంధించిన లైసెన్స్ హక్కు,వాహనములకు సంబంధించిన పూజా సామగ్రి అమ్మకపు లైసెన్స్ హక్కు,కొబ్బరి చిప్పలు తదితరాలకు సంబంధించిన లైసెన్స్ హక్కులను కేటాయించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.వీటికి సంబంధించి కనీస పాట మొత్తాలు, ధరావత్తు వివరాలను దేవస్థానం ప్రకటనలో వెల్లడించింది. మొదటి హక్కుకు కనీస పాట రూ.2 లక్షలు, రెండో హక్కుకు రూ.5 లక్షలు, మూడో హక్కుకు రూ.2 లక్షలుగా పేర్కొన్నారు.టెండర్ పత్రాల సమర్పణ టెండర్ పత్రాలను నిర్ణీత గడువులో దేవస్థానం కార్యాలయం లేదా సంబంధిత దేవాదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. టెండర్ షెడ్యూల్‌తో పాటు అవసరమైన ధరావత్తు డీడీ, ఆధార్ కార్డు జిరాక్స్ తదితర పత్రాలను జతచేయాలని అధికారులు సూచించారు.టెండర్ పత్రాలను నిర్ణీత సమయంలో సీల్డ్ కవర్‌లో టెండర్ బాక్స్‌లో వేయాలని, అనంతరం బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.వేలంలో పాల్గొనే వారికి నిబంధనలు వేలంలో అత్యధిక పాట పాడిన వ్యక్తి నిర్ణీత నిబంధనల ప్రకారం పాట మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత సమయంలో డబ్బు చెల్లించని పక్షంలో తదుపరి అత్యధిక పాటదారునికి అవకాశం కల్పించే నిబంధన ఉంది.గతంలో దేవస్థానానికి బకాయిలు ఉన్నవారు, సంబంధిత నిబంధనల ప్రకారం అనర్హులుగా ఉన్న వ్యక్తులు వేలంలో పాల్గొనడానికి అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేశారు.వేలం ప్రక్రియ దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలకు,సంబంధిత అధికారుల ఆమోదానికి లోబడి ఉంటుందని తెలిపారు.పాత వేలం ప్రక్రియకు కొనసాగింపుగా 2026--27 సంవత్సరానికి సంబంధించిన ఆయా లైసెన్స్ హక్కుల కోసం గతంలో జూన్ 18, జూలై 3, జూలై 17, జూలై 28, ఆగస్టు 7 తేదీల్లో వేలం నిర్వహించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ ప్రక్రియ పూర్తికాలేదు. దీంతో తాజా నోటీసు ద్వారా మరోసారి వేలం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.దేవస్థానానికి సంబంధించిన లైసెన్స్ హక్కులను నిబంధనల ప్రకారం కేటాయించేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**జఫర్గడ్ ప్రతినిధి , ఆగస్టు 14,( తరంగాలు):**
మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో నెలకొన్న సమస్యలను పరిశీలించేందుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ ఆధ్వర్యంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా, మండల కమిటీ నాయకులు కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా దాసగాని సుమ మాట్లాడుతూ కళాశాలలో మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని, కళాశాల చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని డిమాండ్ చేశారు.అలాగే విద్యార్థులు సకాలంలో కళాశాలకు చేరుకునేందుకు విద్యార్థుల సమయానికి అనుకూలంగా బస్ సౌకర్యం కల్పించాలని, మెయిన్ రోడ్ నుంచి కళాశాల వరకు సీసీ రోడ్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.సరైన సౌకర్యాలు లేకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి హర్షిత్ మండల ఉపాధ్యక్షులు శివ సంజన నాయకులు మహేష్ దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి ఆటో యూనియన్ అధ్యక్షులుగా పెండ్యాల బిక్షపతి ముదిరాజ్



**జఫర్గడ్ ప్రతినిధి,ఆగస్టు 14, (తరంగాలు):**మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆటో యూనియన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప్పుగల్ గ్రామంలో ఆటో యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులుగా పెండ్యాల బిక్షపతి ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా గుజ్జరి జగదీష్, కార్యదర్శి బంధువుల స్వామి, కోశాధికారి నాయిని బాలరాజు, సలహాదారులుగా బైరి రాజు, గంగాధర్,యాదగిరి,బైరు రంజిత్, యాట రమేష్, శివరాత్రి సతీష్, లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## గ్రామ పంచాయతీల పరిపాలనపై వీడియో కాన్ఫరెన్స్

- పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ సూచనలు
- ఎంపీడీఓ అద్వైత



**నర్సంపేట ప్రతినిధి, ఆగస్టు 14 (తరంగాలు):** ఖానాపురం మండల కేంద్రంలో ఎంపీడీఓ వి. అద్వైత ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామ పంచాయతీల పరిపాలనపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పంచాయతీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ఎంపీడీఓ అద్వైత మాట్లాడుతూ చేయూత పింఛన్లు, 16వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ పరిపాలన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. చేయూత పింఛన్లకు సంబంధించి వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, ఫైలేరియా బాధితులు, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు తదితర ఏడు కేటగిరీల్లో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించనున్నట్లు వెల్లడించారు.ముఖ్యంగా ఒంటరి మహిళల పింఛన్‌కు సంబంధించిన ధ్రువపత్రం పరిశీలన, జారీ ప్రక్రియ ఎంపీడీఓ కార్యాలయం ద్వారానే జరుగుతుందని, ఇందుకోసం ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉన్న మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పింఛన్ దరఖాస్తులను సకాలంలో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సమర్పించాలని కోరారు.గ్రామ పంచాయతీల నుంచి స్వీకరించిన పింఛన్ దరఖాస్తులను మండల కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపారు. అలాగే సీఎఫ్‌సీ నిధుల వినియోగం, పంచాయతీ పరిపాలన, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలు అందించారు.

## ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 14,(తరంగాలు):** ప్రజా సమస్యలు మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించి ఇప్పటికే రాష్ట్ర జిల్లా రెవెన్యూ డివిజన్ స్థాన అమలు చేస్తున్న ప్రజావాణికపై మండల కేంద్రాల్లోనూ నిర్వహించాలని మంగళవారం ప్రణాళిక ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా దేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించాలి. దీనికి నోడల్ అధికారిగా ఎంపీడీవో ను నియమించారు 23 శాఖల మండల స్థాయి మండల స్థాయి అధికారులు ప్రజావాణికి తప్పనిసరిగా హాజరు కావాలి ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి తక్షణ చర్యలు ప్రారంభించాలి. అదేవిధంగా మండల పరిషత్ లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శనివారం, 15 ఆగస్టు , 2026



# మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్‌నొప్పి మాత్రమే కాదు, స్వేచ్ఛగా కదిలే హక్కును కూడా ప్రభావితం చేసే సమస్య

•డా. సాయి దినేష్ తాటికొండ
•కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్, యశోద హాస్పిటల్, సికింద్రాబాద్.

**నల్లగొండ- ఆగస్టు14,తరంగాలు:**
మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్ అనేది కేవలం మోకాలి నొప్పికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది క్రమంగా మన స్వేచ్ఛగా కదిలే సామర్థ్యాన్ని, రోజువారీ పనులను చేసుకునే స్వాతంత్ర్యాన్ని ప్రభావితం చేసే సమస్య అని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్కి చెందిన డాక్టర్ తాటికొండ సాయి దినేష్ తెలిపారు స్థానిక ప్రైవేట్ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చాలామంది మోకాలి నొప్పిని వయసుతో వచ్చే సహజమైన సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారని . "వయసు పెరిగింది కాబట్టి మోకాళ్ల నొప్పి సహజమే" అని అనుకోవడం వల్ల చాలామంది సరైన సమయంలో వైద్యులను సంప్రదించరన్నారు.
కానీ ఆస్టియో ఆర్థరైటిస్ పెరుగుతున్న కొద్దీ మెట్లు ఎక్కడం, ఎక్కువ దూరం నడవడం, కుర్చీలోంచి లేవడం, నేలపై కూర్చోవడం వంటి సాధారణ పనులు కూడా కష్టంగా మారవచ్చు. బయటకు వెళ్లడం, ప్రయాణం చేయడం, కుటుంబ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి విషయాల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతాయి.
ఒక దశలో "నేను ఎక్కడికైనా వెళ్లాలంటే ఇతరుల సహాయం అవసరం" అనే పరిస్థితి కూడా రావచ్చు. అందుకే మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్‌ను కేవలం నొప్పిగా కాకుండా, ఒక వ్యక్తి స్వాతంత్ర్యాన్ని క్రమంగా తగ్గించే సమస్యగా చూడాలి.




అయితే ఆస్టియో ఆర్థరైటిస్ వచ్చిందంటే జీవితాంతం నొప్పితోనే ఉండాల్సిన అవసరం లేదు. ప్రారంభ దశల్లో బరువు నియంత్రణ, సరైన వ్యాయామం, ఫిజియోథెరపీ, మందులు మరియు అవసరానికి అనుగుణంగా ఇతర చికిత్సల ద్వారా నొప్పిని నియంత్రిస్తూ మోకాలి పనితీరును కాపాడుకోవచ్చన్నారు.
అలాగే, మోకాలి నొప్పి ఉన్న ప్రతి ఒక్కరికీ శస్త్రచికిత్స అవసరం లేదు. అదే సమయంలో తీవ్రమైన ఆర్థరైటిస్ ఉన్నవారు కూడా అవసరమైన చికిత్సను సంవత్సరాల తరబడి వాయిదా వేయాల్సిన అవసరం లేదు. ప్రతి రోగికి వ్యాధి తీవ్రత, నొప్పి, వయసు, ఆరోగ్య పరిస్థితి రోజువారీ కార్యకలాపాలపై దాని ప్రభావాన్ని బట్టి చికిత్సను నిర్ణయించాలని
కొంతమంది రోగులకు నాన్-సర్జికల్ చికిత్స సరిపోతుంది. ఎంపిక చేసిన కొన్ని సందర్భాల్లో ఇంజెక్షన్లు లేదా ఇతర నొప్పి నియంత్రణ చికిత్సలు కూడా ఉపయోగపడవచ్చు. అయితే ఆర్థరైటిస్ తీవ్రంగా ఉండి, నొప్పి మోకాలి పనితీరు రోజువారీ జీవితాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్నప్పుడు, తగిన సమయంలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స గురించి ఆలోచించవచ్చున్నారు .ఆధునిక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స యొక్క లక్ష్యం కేవలం ఎక్స్‌రేలో కనిపించే మోకాలిని మార్చడం కాదు. రోగికి సాధ్యమైనంత వరకు తన సాధారణ జీవితాన్ని తిరిగి అందించడం అసలు లక్ష్యం.నొప్పి లేకుండా నడవడం, మెట్లు ఎక్కడం, కుటుంబంతో కలిసి ప్రయాణించడం, రోజువారీ వ్యక్తిగత పనులను ఇతరులపై ఆధారపడకుండా చేసుకోవడం ఇవన్నీ చికిత్స విజయానికి ముఖ్యమైన అంశాలు.అందువల్ల, మోకాలి నొప్పిని కేవలం "వయసు వల్ల వచ్చింది" అని నిర్లక్ష్యం చేయకూడదు. నొప్పి కారణంగా నడవడం, మెట్లు ఎక్కడం, కూర్చోవడం, నిలబడడం లేదా ప్రయాణం చేయడం కష్టంగా మారితే ఆర్థోపెడిక్ నిపుణుడిని సంప్రదించి సరైన కారణాన్ని గుర్తించుకోవాలన్నారు.మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్ మీ స్వేచ్ఛను, మీ స్వాతంత్ర్యాన్ని పూర్తిగా తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. సరైన సమయంలో సరైన నిర్ధారణ, సరైన చికిత్స తీసుకుంటే మనం ఆ స్వేచ్ఛను తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.

# మండల ప్రజావాణి విజయవంతంగా నిర్వహించాలి

•జిల్లా అదనపు కలెక్టర్ మరియు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి: ప్రేమ్ కరణ్ రెడ్డి



**నల్గొండ- ఆగస్టు14,తరంగాలు :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మండల స్థాయిలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మరియు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు మండల స్థాయి ప్రజావాణి సెక్షన్ ఇంచార్జ్ మరియు ప్రజావాణి ఆపరేటర్లకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు నోడల్ అధికారిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉంటారని, ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు విధిగా సమయపాలన పాటిస్తూ హాజరుకావాలని తెలిపారు. ప్రజావాణి నిర్వాణకు అవసరమైన కంప్యూటర్ స్కానర్ ఇంటర్నెట్ మరియు త్రాగునీరు మరుగుదొడ్లు వికలాంగులకు వీల్ చైర్లు మొదలైన ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో దరఖాస్తుదారునికి తప్పకుండా ప్రజావాణి వెబ్ పోర్టల్ లో దరఖాస్తు నమోదు చేసి రసీదు ఇవ్వాలన్నారు. ప్రజావాణి నిర్వహణలో సమయపాలన పాటించని మండల స్థాయి అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ శిక్షణలో ఈడీఎం దుర్గారావు ప్రజావాణి దరఖాస్తులు వెబ్ పోర్టర్లో నమోదు చేసే విధానం వివిధ శాఖలకు ప్రజావాణి దరఖాస్తులను ట్రాన్స్ఫర్ చేసే విధానాన్ని మరియు తీసుకోవలసిన జాగ్రత్తలను పూర్తిగా వివరించారు. ఈ శిక్షణలో ప్రజావాణి ఇంచార్జ్ ఉషా నాయక్ తో పాటు జిల్లా పరిషత్ సూపరిండెంట్ శ్రీనివాస్ చారి జిల్లా ప్రజా పరిషత్ ప్రజావాణి సెక్షన్ ఇంచార్జ్ ఎండి గులాం రబ్బాని తదితరులు పాల్గొన్నారు.



# భరోసా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్,

•మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం కీలకం

**నల్గొండ- ఆగస్టు14, తరంగాలు :**
మహిళలు, బాలికలు మరియు చిన్నారులు లైంగిక హింసకు గురైన సందర్భాల్లో వారికి అండగా నిలుస్తూ, పోలీస్, వైద్య, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ వంటి సమగ్ర సేవలను ఒకే వేదిక ద్వారా అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ అన్నారు.
ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ నల్గొండలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, భరోసా కేంద్రం ద్వారా బాధితులకు అందిస్తున్న వివిధ సేవలను పరిశీలించారు. భరోసా కేంద్రం సిబ్బందితో మాట్లాడి మహిళలు, బాలికలు మరియు చిన్నారులకు అందిస్తున్న పోలీస్ సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.
భరోసా కేంద్రంలోని కౌన్సెలింగ్ గదులు, బాధితులకు అందిస్తున్న సహాయ సేవలు, కేసుల నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. బాధితులకు సత్వర సహాయం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు.బాధితులు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తెలియజేసే విధంగా సానుకూలమైన, నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు మరియు చిన్నారుల పట్ల సానుభూతి, గోప్యత, గౌరవంతో వ్యవహరిస్తూ వారికి అవసరమైన పోలీస్, వైద్య, న్యాయ మరియు మానసిక సహాయాన్ని సత్వరమే అందించాలని సూచించారు.బాలలపై లైంగిక నేరాల కేసుల్లో బాధిత చిన్నారుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని చైల్డ్ ఫ్రెండ్లీ విధానంలో విచారణ, కౌన్సెలింగ్ మరియు ఇతర సహాయ సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా సంబంధిత పోలీస్ అధికారులు, వైద్య, న్యాయ మరియు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణించి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు నిరంతరం సహకారం అందించాలని ఎస్పీ తెలిపారు. కేసుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగే వరకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. భరోసా కేంద్రం బాధితులకు అండగా నిలిచే కేంద్రంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఎస్ఐ అఫ్రీన్, ఎస్ఐ గౌస్, ఏఎస్ఐ అబేదా, శ్రీనివాస్, భరోసా కేంద్రం కోర్డినేటర్ నళిని,సిబ్బంది, సంబంధిత పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 14 తరంగాలు** వలిగొండ పట్టణ కేంద్రంలో శుక్రవారం ప్రధాన కూడలిలో ద్విచక్ర వాహనాలు తనిఖీ లో భాగంగా ఎస్సై ఏ శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా అందులో నంబర్ ప్లేటు లేని 10 ద్విచక్ర వాహనాలను దొరకగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే హెల్మెట్ మరియు ఇన్సూరెన్స్ లేని వాహనాల యజమానులకు జరిమానా విధించి ట్రాఫిక్ ప్రమాణాలను అందరూ విధిగా పాటించాలి అని,ట్రాఫిక్ ప్రమాణాలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని తెలియజేశారు.



# రక్తదాతలే నిజమైన హీరోలు: డీఎంహెచ్ఓ

•డాక్టర్ తుకారాం రాథోడ్




**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 14**
రక్తదానంతో అమూల్యమైన ప్రాణాలను కాపాడవచ్చు -- ఫ్రైడే--డ్రై డే, ప్రసూతి సేవలు, అంటువ్యాధులు కాని వ్యాధులు. స్క్రీనింగ్‌పై అధికారుల సమీక్ష
రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే రక్తదాతలు నిజమైన హీరోలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సీనియర్ సివిల్ జడ్జి కం సెక్రటరీ రాజేందర్‌తో కలిసి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు.ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఆరోగ్యవంతమైన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి "రక్తదానం చేయండి--ప్రాణాలను కాపాడండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.అనంతరం సఫాయి బస్తీలోని ఖానిజను ఆకస్మికంగా తనిఖీ చేసి ఫ్రైడే--డ్రై డే కార్యక్రమం అమలును పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల ద్వారా వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులను అరికట్టాలని సిబ్బందికి సూచించారు.అలాగే సాధారణ కాన్పులను పెంచాలని, జుణణ ప్రకారం గర్భిణులను ఆసుపత్రుల్లో ప్రసవించేలా ప్రోత్సహించాలని, హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. చీజణ కార్యక్రమంలో భాగంగా 30 ఏళ్లు పైబడిన వారందరికీ బీపీ, షుగర్ తదితర వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి, వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా మందులు అందేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధామోహన్, డాక్టర్ సీతారాం, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ సురేందర్, సిబ్బంది శ్రీనివాస్, జగదీష్, శారద, విజయలక్ష్మి, సంగీత, సుమంత్, పావని తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS

శనివారం, 15 ఆగస్టు , 2026

జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 14,తరంగాలు :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి మరియు వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల అమలు, అర్హుల ఎంపిక, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూ సంబంధిత సమస్యలు, పేదలకు త్వరితగతిన గృహాల మంజూరు, రెవెన్యూ శాఖ పరిధిలోని ప్రజా సమస్యలు వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.నర్సంపేట నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. ఈ విషయాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు యువ పారిశ్రామికవేత్త పడిదల నవీన్ కుమార్ ఉన్నారు.

## దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

**పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డేపై మోడీ**

న్యూఢిల్లీ,ఆగస్ట్14 దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్య్ర దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయని మోదీ పేర్కొన్నారు.

## కరూరు తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

**హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధింపు**

న్యూఢిల్లీ,ఆగస్ట్14 కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజయ్‌కు స్వల్ప ఊరట లభించినట్లయ్యింది. ఈ కేసులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం

చేస్తే అభ్యంతరం చెప్పే వారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒకే ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు మీరెవరు? అని ప్రశ్నించింది. గతేడాది టీవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీకే అధినేత విజయ్ మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు. అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాలు వినియోగించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రభుత్వ తప్పిదాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ బాధితులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వని విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ కేసులో కారుణ్య నియామకాలకు అనుమతిస్తే ఒక ప్రమాదకరమైన ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హైకోర్టు అప్పట్లో పేర్కొంది.

## పెడదోవ పట్టిన కన్నకొడుకులు

### తట్టుకోలేక మాతృమూర్తి ఆత్మహత్య

రంగారెడ్డి,ఆగస్ట్14 నగరంలోని కూకట్‌పల్లిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కన్న కొడుకులిద్దరూ పెడదోవ పట్టడంతో ఆ తల్లి తీవ్ర మానసిక వేదనకు గురై బలవన్మరణానికి పాల్పడ్డారు. ఒక కొడుకు తండ్రిని చంపి జైలులో ఉండగా, మరో కొడుకు గంజాయికి బానిసయ్యాడు. ఇలా చేతికి అందివచ్చిన కొడుకులిద్దరూ పెడదోవ పట్టడంతో తట్టుకోలేక పోయిన తల్లి ఆత్మహత్య చేసుకుంది. రంగారెడ్డి జిల్లా జన్వాడకు చెందిన తిరుపతి రవీందర్ భార్య సుధ. కేపీహెచ్‌బీ సర్దార్ పటేల్ నగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో హౌస్ కీపింగ్‌లో పనిచేస్తున్న సుధ.. అక్కడే ఓ గదిలో నివాసం ఉంటోంది. ఈమెకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు కొన్నేళ్ల కిందట తండ్రిని చంపిన కేసులో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అలాగే చిన్న కొడుకు గంజాయికి బానిసై నిత్యం తల్లిని వేధింపులకు గురిచేసేవాడు. దీంతో మనోవేదనకు గురైన సుధ ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమాజంలో చెడు వ్యసనాలు, పెడదోవ పడుతున్న యువత వల్ల కుటుంబాలు ఏ విధంగా కూలిపోతున్నాయో చెప్పడానికి ఈ ఘటన ఒక సజీవ సాక్ష్యం. కన్నబిడ్డల బాధ్యతారాహిత్యం, మత్తు పదార్థాల మహమ్మారి ఒక అమాయక తల్లి ప్రాణాన్ని బలితీసుకోవడం సమాజ నైతికతకే తీరని కలంకమై నిలిచింది

# డిసెంబర్ నాటికి 100 పడకల ఆసుపత్రి పూర్తి చేయాలి

**పనులు వేగవంతం చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు : కలెక్టర్ అంకిత్**



**ఇల్లందు, తరంగాలు న్యూస్ ఆగస్టు 14:**
ఇల్లందు పట్టణంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. రూ.37.50 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఇల్లందు చెరువు, సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఆసుపత్రి పనుల్లో వేగం: 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా వేగం పెంచాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఐసీయూ, ఎమర్జెన్సీ, వార్డులు తదితర విభాగాలను సౌకర్యవంతంగా ఏర్పాటు చేయాలని, నిర్మాణ నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని స్పష్టం చేశారు.
తాగునీటికి ప్రాధాన్యత: ఇల్లందు చెరువును పరిశీలించిన కలెక్టర్ నీటి నిల్వలు, తాగునీటి అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని, వృథాను అరికట్టాలని సూచించారు. రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటితో సాగు చేసే పెసర తదితర ప్రత్యామ్నాయ పంటలను చేపట్టేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ: సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. గతేడాది సాధించిన 100 శాతం ఉత్తీర్ణతను కొనసాగించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని సూచించారు.పాఠశాలలోని లీకేజీలను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. స్టోర్‌రూమ్‌లో బియ్యం, పప్పులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు.
ఈ పర్యటనలో తహసీల్దార్ ఖాసీం, ఎంపీడీవో ధన్సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు

# జనగామ భరోసా కేంద్రాన్ని సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్.

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం జనగామలోని భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు.
ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మహిళలు,







చిన్నారులు, ఇతర బాధితులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి కేసును నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్శనలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ సుధా, లీగల్ అడ్వైజర్ దయామణి, సపోర్ట్ పర్సన్స్ స్వాతి, అపర్ణతో పాటు ఇతర సిబ్బంది సునీత, హరిత పాల్గొన్నారు.

# దేశభక్తి స్ఫూర్తిని చాటిన ఓసిటి తిరంగ్ బైక్ ర్యాలీ



**ముఖ్య అతిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు**

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 14,తరంగాలు** : వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓసిటి రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగ్ బైక్ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. జాతీయ జెండాలను చేతబూని ద్విచక్ర వాహనాలపై పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఓసిటి కాలనీవాసులు దేశభక్తిని చాటుతూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని ర్యాలీలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ జాతీయ భావాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు."హర్ ఘర్ తిరంగా" స్ఫూర్తితో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని, యువతలో జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని ఎర్రబెల్లి ప్రదీప్ రావు పేర్కొన్నారు.జాతీయ జెండాలతో సాగిన తిరంగ్ బైక్ ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఓసిటి రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగు చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ బొబ్బల శ్రీనివాస్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శనివారం, 15 ఆగస్టు , 2026


# కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా "గ్రామకమిటీల పునర్నిర్మాణం

**• 'కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్**



**ఐనవోలు, ఆగస్టు 14, తరంగాలు ప్రతినిధి:** ప్రజాసేవే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకు చేరవేస్తూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల పునర్నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఐనవోలు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అయినవోలు గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్ష పదవికి పేర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీల పునర్నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడంతో పాటు దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సహకారంతో నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ఇన్‌చార్జిలు తెల్లా సుగుణ-కిషోర్, అనుకోటి నాగరాజు, అరకపుల రాజు, హనుమకొండ జిల్లా డిజిటల్ మీడియా ఇన్‌చార్జి రాయపురం సాంబయ్య, మండల ఫోరం అధ్యక్షులు పోలపల్లి శివశంకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, టెంపుల్ డైరెక్టర్ పూస చిరంజీవిరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు గ్యాదరి భాస్కర్, మండల నాయకులు బొమ్మినేని రాకేష్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు రావుల రవీందర్, కాంటెస్ట్ సర్పంచ్ బొల్లపల్లి మధు, ఉపసర్పంచ్ బరిగల భాస్కర్, మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్, యూత్ ఉపాధ్యక్షులు కొండేటి దిలీప్,ఐనవోలు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ గ్రామ కమిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# ఆలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 14,తరంగాలు** :వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఆలయల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కడిపికొండలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనుల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయంలో జరుగుతున్న మూలవిరాట్ విగ్రహ జీర్ణోదరణ పూజలో పాల్గొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు.ఈ శివాలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా,గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు.ఆలయ అభివృద్ధి కోసం భక్తుల సౌకర్యాలు పెంచడానికి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ప్రెసిడెంట్ కర్ర హరీష్ రెడ్డి, 44వ డివిజన్ ప్రెసిడెంట్ సదానందం యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,మాజీ పిఏసిఎస్ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, మాజీ డివిజన్ ప్రెసిడెంట్ సట్ల సదానందం,సోషల్ మీడియా కోఆర్డినేటర్ సతీష్,యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ప్రణయ్,మండల పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మంద రమేష్,సీనియర్ నాయకులు కోటేశ్వర్,ఎడ్ల రాజమల్ల రెడ్డి, మహిళ నాయకులు నీలం రజిని, ప్రశాంతి,కాయితే కవిత,డివిజన్ సీనియర్ నాయకులు కార్యకర్తలు,అర్చకులు తదితరులు పాల్గొన్నారు,

# వన భోజనాలతో ఐక్యత, స్నేహభావం





**•సమాజ ఐక్యతకు వనభోజనాలు ప్రతీక**

**• వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 14,తరంగాలు** : వనభోజనాలతో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.ఐనవోలు మండలం నందనం,రాంనగర్ గ్రామ వాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనభోజనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.గ్రామ వాసులు ఎమ్మెల్యే కి శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.వనభోజన మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.వనభోజన మహోత్సవాల ద్వారా ఆధ్యాత్మిక భావాలు,సభ్యుల మధ్య సోదర భావాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,సర్పంచ్ రాజు,హన్మకొండ జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,మాజీ మండల అధ్యక్షులు మహేందర్,మండల ఫోరం అధ్యక్షులు శంకర్ రెడ్డి, జేబిఎల్ జిల్లా అధ్యక్షులు జన్నపు రెడ్డి రుగ్వేద్ రెడ్డి, సర్పంచులు,మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు,గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.






## ఒంట్లో వేడి పెరిగి చాలా ఇబ్బందిగా ఉందా.. ఈ టిప్స్ మీ కోసమే..!

ఎండాకాలం వచ్చిందంటే చాలు ఎండలు మండిపోతాయి. ఈ ఎండలవల్ల నిత్యం శరీర ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. శరీరం డీహైడ్రేట్ అవుతుంది. దాంతో తరచూ ఒళ్లు అలసిపోయి నీరసం ఆవహిస్తుంది. ఏం చేయాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. శరీరం సహకరించదు. అలాంటి పరిస్థితి రావద్దంటే శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా కాపాడుకోవాలి. శరీర ఉష్ణోగ్రతలు పెరుగకుండా చూసుకోవాలి. అందుకోసం కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. మరి ఆ చిట్కాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

1. రోజూ రెండు కప్పుల తాటి బెల్లం కలిపిన నీళ్లను తాగడం ద్వారా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.
2. ప్రతి రోజూ క్రమం తప్పకుండా నిమ్మ రసం, కొబ్బరి నీళ్లు తాగడం ద్వారా కూడా శరీరంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చల్లబడుతుంది.
3. అదేవిధంగా రోజూ ఉదయం కొబ్బరి నూనె లేదా పొద్దు తిరుగుడు నూనెతో శరీరానికి మర్ధన చేసుకుని స్నానం చేయడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.
4. క్రమం తప్పకుండా ఎర్ర మందారం టీ తాగడంవల్ల కూడా శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.
5. కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగడం ద్వారా కూడా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.
6. అంతేగాక మెంతులను వేయించి, పొడిచేసి రోజూ గోరు వెచ్చటి నీటితో కలిపి తాగడం ద్వారా కూడా ఒంట్లో వేడిని తగ్గించుకోవచ్చు.
7. సోంపు, జీలకర్ర, ధనియాలు రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు తాగడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.
8. దానిమ్మ గింజల్లో కూడా శరీరంలోని వేడిని తగ్గించే లక్షణం ఉంది. రెండు మూడు రోజులకు ఒకసారైనా దానిమ్మ గింజలు తినడం లేదా దానిమ్మ రసం తాగడంవల్ల శరీరం చల్లగా ఉంటుంది.
9. అదేవిధంగా వేడిచేసే ఆహార పదార్థాలైన పుల్లటి పండ్లు, బీట్‌రూట్‌లు, క్యారెట్‌లను వేసవిలో ఎక్కువగా తినకుండా ఉండటం ద్వారా కూడా శరీర ఉష్ణోగ్రతలను అదుపులో పెట్టుకోవచ్చు.

## దేశంలో ఏటా పెరిగిపోతున్న కిడ్నీ వ్యాధులు..

**• 30 ఏళ్ల నుంచే పరీక్షలు తప్పనిసరి అంటున్న నిపుణులు..**



మూత్రపిండాల ఆరోగ్యం సాధారణంగా తీవ్ర లక్షణాలు కనిపించే వరకు నిర్లక్ష్యానికి గురవుతుంటుంది. అయితే ప్రస్తుతం దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిభారత్‌లో ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. ఇతర వ్యాధులతో పోలిస్తే కిడ్నీ సమస్యలు చాలా కాలం వరకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా మెల్లగా అభివృద్ధి చెందుతాయి. లక్షణాలు బయటపడే సమయానికి కిడ్నీలకు గణనీయమైన నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అందుకే 30 ఏళ్ల వయస్సు నుంచే కిడ్నీ ఆరోగ్య పరీక్షలు ప్రారంభించడం అత్యంత కీలకమని వైద్యులు చెబుతున్నారు. భారత్‌లో కిడ్నీ వ్యాధుల భారం వేగంగా పెరుగుతోంది. తాజా పరిశోధనల ప్రకారం 2011-2017 మధ్య కాలంలో సుమారు 11 శాతం ఉన్న జఖణ ప్రబలత 2018-2023 మధ్య కాలంలో 16 శాతానికి పైగా పెరిగింది. ఇది పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో సూచిస్తోంది. ఈ పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయి. వేగవంతమైన పట్టణీకరణ, కూర్చునే జీవనశైలి, అసమతుల ఆహారం, పెరుగుతున్న స్థూలకాయం కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తున్నాయి. అదనంగా, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ కేసులు భారత్‌లో అధికంగా ఉండటం కూడా కిడ్నీ నష్టానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

### ముందే పరీక్షలు చేయించడం మంచిది..

కిడ్నీ వ్యాధులలో అత్యంత ప్రమాదకర అంశం ఏంటంటే, ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. చాలా మంది తమ కిడ్నీ పనితీరు క్రమంగా తగ్గిపోతున్నదని తెలియకుండా సాధారణ జీవితం కొనసాగిస్తుంటారు. అందువల్ల ముందస్తు గుర్తింపు అత్యంత అవసరం. గతంలో కిడ్నీ వ్యాధులను వృద్ధులకు మాత్రమే సంబంధించిన సమస్యగా భావించేవారు. అయితే ప్రస్తుతం ఈ ధోరణి మారుతోంది. 30లు, 40ల్లో ఉన్నవారిలో కూడా కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయి. ఇది ముందస్తుగా వచ్చే డయాబెటిస్, రక్తపోటు, స్థూలకాయం వంటి సమస్యలతో సంబంధం కలిగి ఉంది. ఈ వ్యాధులు నియంత్రణలో లేకపోతే కిడ్నీలలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతింటాయి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలను, అదనపు ద్రవాన్ని తొలగించే కిడ్నీల సామర్థ్యం తగ్గిపోతుంది. 30 ఏళ్ల వయస్సు తర్వాత స్క్రీనింగ్ ప్రారంభించడం ద్వారా లక్షణాలు కనిపించకముందే కిడ్నీ సమస్యలను గుర్తించవచ్చు. సీరమ్ క్రియాటినిన్, ఈజీఎఫ్ఆర్ యూరిన్ అల్బ్యూమిన్ వంటి పరీక్షలు ప్రారంభ దశలోనే అసాధారణతలను గుర్తించడంలో సహాయపడతాయి. ముందుగానే గుర్తిస్తే జీవనశైలి మార్పులు, మందులతో వ్యాధిని నియంత్రించవచ్చు.

### కిడ్నీ వ్యాధులకు కారణాలు ఇవే..


కిడ్నీ వ్యాధులకు అనేక ప్రమాద కారకాలు ఉన్నాయి. ముఖ్యంగా డయాబెటిస్, హైపర్‌టెన్షన్ ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. భారత్‌లో జఖణ కేసుల్లో పెద్ద భాగం ఈ రెండు కారణాల వల్లనే వస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవి కాకుండా స్థూలకాయం, అధిక ఉప్పు వినియోగం, పొగ త్రాగడం, ఎక్కువగా పెయిన్‌కిల్లర్స్ వాడటం, కుటుంబంలో కిడ్నీ వ్యాధుల చరిత్ర ఉండటం వంటి అంశాలు కూడా ప్రమాదాన్ని పెంచుతాయి. కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు, వ్యవసాయ కార్మికుల్లో నీటి కొరత వంటి పర్యావరణ కారణాలు కూడా ప్రభావం చూపుతాయి. జఖణ ప్రధాన సవాలు దాని నిశ్శబ్ద ప్రగతి. ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు ఉండవు. కాళ్ల వాపు, అలసట, మూత్రంలో మార్పులు, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపించే సమయానికి కిడ్నీల పనితీరు గణనీయంగా తగ్గిపోయి ఉంటుంది. అయితే ముందస్తు గుర్తింపు ద్వారా పరిస్థితిని పూర్తిగా మార్చుకోవచ్చు. సమయానికి చికిత్స తీసుకుంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం ద్వారా వ్యాధి ప్రగతిని నెమ్మదింప చేయవచ్చు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్ కు కేజీకేఎస్ మండల కమిటీ ఘన సన్మానం





**కేసముద్రం, ఆగస్టు 14,తరంగాలు :** కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడిగా చిలువేరు సమ్మయ్య గౌడ్ నియమితులైన సందర్భంగా కేజీకేఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సమ్మయ్య గౌడ్‌కు శు భాకాంక్షలు తెలిపారు.ప్రజాసేవలో ముందుంటూ పేదలు, నిరుపేదలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న సమ్మయ్య గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం హర్షణీయమని వారు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై సేవాభావంతో పనిచేసే నాయకుడికి ఈ బాధ్యతలు దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.కేసముద్రం మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆకాంక్షించారు. సమ్మయ్య గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు విస్తృతంగా సేవలందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ మండల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య, మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, కేజీకేఎస్ సొసైటీ అధ్యక్షులు మేడి ఉపేందర్, ఇనుగుర్తి సొసైటీ అధ్యక్షులు మల్లయ్య, దానసరి సొసైటీ అధ్యక్షులు చింతనూరి వెంకన్న, ఉప్పరపల్లి సొసైటీ అధ్యక్షులు శంకరయ్య, కాట్రపల్లి ంసొసైటీ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అప్పనపల్లి సొసైటీ అధ్యక్షులు జర్నలిస్టు యాకన్న, వెంకటగిరి సొసైటీ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, రంగాపురం సొసైటీ అధ్యక్షులు వీరభద్ర గౌడ్, ఉప్పరపల్లి సొసైటీ సెకండ్ అధ్యక్షులు తాండ వెంకన్న, జోగు రాములు తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నేతకు బీజేపీ శ్రేణుల పరామర్శ



•కర్మా సోమిరెడ్డి రెడ్డికి అభినందనలు..
శాలువాతో ఘన సత్కారం

వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 14 (తరంగాలు): వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు దాసరి రవిచందర్ (మమత ఫోటో స్టూడియో) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా బీజేపీ శ్రేణులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, చిరు సహాయం అందజేశారు.అనంతరం జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా నియమితులైన కర్మా సోమిరెడ్డి రెడ్డిని బీజేపీ నాయకులు అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన 'చాయ్ పై చర్చ' కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ పాల్గొని నాయకులతో పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షులు అడప రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మైసమ్మ రాము, జిల్లా నాయకులు కొండేటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి నినాదాలతో కదిలిన 100 మీటర్ల జాతీయ జెండా ర్యాలీ






•హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 14,తరంగాలు :** వరంగల్ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 100 మీటర్ల జాతీయ జెండాతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. వరంగల్ పోచమ్మ మైదాన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు సాగిన ఈ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి తో పాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొని ర్యాలీకి మద్దతు తెలిపారు. జాతీయ జెండాను చేతబట్టి బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.ఈ ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ , మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, నర్సంపేట

# టాక్సిక్ కోసం కియారా చాలా కష్టపడింది

**నటుడు యశ్ ప్రశంసలు**




సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుం దని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

## 16న ఇరుముడి ప్రీరిలీజ్ వేడుక




మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# జెమిమా రోడ్రిగ్స్‌కు గాయం..

ఇండియన్ ఉమెన్స్ క్రికెట్ టీమ్ స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ ఇంజ్యూరీ కారణంగా రాబోయే రెండు బిగ్ టోర్నమెంట్లకు దూరమైంది. ఇంగ్లాండ్ లో జరిగిన 'ద హండ్రెడ్' లీగ్ లో ఆడుతున్న సమయంలో హామ్‌స్ట్రింగ్ గాయం వల్ల ఆమె రాబోయే ఉమెన్స్ ఆసియా కప్ తో పాటు ఏషియన్ గేమ్స్ నుంచి కంప్లీట్ గా రూల్ అవుట్ అయింది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (సీఓఈ) మెడికల్ టీమ్ ఆమెను పరిశీలించి, గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో రెస్ట్ అవసరమని తెలిపినట్లు బిసిసిఐ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. "ఆగస్టు 3న ఇంగ్లాండ్ లో 'ద హండ్రెడ్' మ్యాచ్ ఆడుతుండగా జెమిమా కుడి తొడ కండరాల గాయానికి గురైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో బిసిసిఐ మెడికల్ టీమ్ ఆమెకు క్లినికల్ టెస్టులు నిర్వహించింది. ఈ టెస్టుల్లో ఆమెకు హై-గ్రేడ్ టియర్ ఉన్నట్లు తేలింది" అని బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. దాంతో యూఏఈ వేదికగా జరగబోయే ఆసియా కప్, జపాన్ లో జరగబోయే ఏషియన్ గేమ్స్ కు జెమిమా దూరమవ్వక తప్పలేదు. 25 ఏళ్ల జెమిమా స్థానంలో ప్రతీక రావల్ ను ఉమెన్స్ సెలెక్షన్ కమిటీ రీప్లేస్‌మెంట్ గా ఎంపిక చేసింది.

THARANGALU DAILY NEWS
శనివారం, 15 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# యువతలో దేశభక్తి స్ఫూర్తి నింపడమే లక్ష్యం






- కులమతాలకు అతీతంగా జాతీయ ఐక్యతకు పిలుపు
- 'హర్ ఘర్ తిరంగా' స్ఫూర్తితో ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి
- త్రివర్ణ పతాకాలతో కదం తొక్కిన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు
- దేశభక్తి నినాదాలతో వర్ధన్నపేటలో ఘనంగా 'తిరంగా యాత్ర'
- పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ

**వర్ధన్నపేట, ఆగస్టు 15**:యువతలో దేశభక్తి స్ఫూర్తి నింపడమే లక్ష్యమని,'హర్ ఘర్ తిరంగా' స్ఫూర్తితో ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరవేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోడీ పిలుపు మేరకు వర్ధన్నపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు అడప రాజు ఆధ్వర్యంలో శనివారం భారీగా 'తిరంగా యాత్ర' నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. సుమారు గంటపాటు సాగిన ఈ యాత్ర వందేమాతరం, భారత్ మాతాకీ జై అనే నినాదాలతో వర్ధన్నపేట హోరెత్తింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ప్రజల్లో, ముఖ్యంగా యువతలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో 'తిరంగా యాత్ర' నిర్వహించిన మండల పార్టీ నాయకత్వాన్ని అభినందించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడం, కులమతాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటేననే ఐక్యతా భావాన్ని చాటడమే 'తిరంగా యాత్ర' ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం, పట్టణంలో జాతీయ జెండా స్ఫూర్తిని విస్తరించాలని పిలుపునిచ్చారు. చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకొని 'భారత్ మాతా కీ జై' నినాదాలతో యాత్ర కొనసాగించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, కొండేటి సత్యం, జిల్లా కౌన్సిల్ మెంబర్ మైసమ్మ రాము, మండల పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## శుద్ధీకరణ ఒక బూటకం బీజేపీ ఆడే ఒక నాటకం

- వివక్షకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం మా పోరాటం
- ఖర్గే కు సంఘీభావంగా కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు
- హల్ద్వానీ ఘటనకు నిరసనగా సత్యాగ్రహ ర్యాలీ నిర్వహించిన డిసిసి
- అధ్యక్షుడు అయూబ్ పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య






**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 14, తరంగాలు** :ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పట్ల జరిగిన వివక్షాపూరిత, అవమానకర చర్యను తీవ్రంగా ఖండిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో వెంకట్రామ జంక్షన్ నుంచి ప్రారంభమైన సత్యాగ్రహ ర్యాలీ కాశీబుగ్గలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు గ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరై కాంగ్రెస్ శ్రేణులకు సంఘీభావం తెలిపారు.అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి జై భీమ్ అని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల జరిగిన అవమానకర, వివక్షాపూరిత చర్య అత్యంత బాధాకరమన్నారు. కులం, మతం పేరుతో ఒక వ్యక్తిని అవమానించడం, వివక్షకు గురిచేయడం భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని అన్నారు.గుడి, మసీదు ముందు పవిత్ర గంగాజలాన్ని తీసుకువచ్చి శుద్ధి చేస్తున్నట్లుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాదులు ఒక బూటకపు నాటకానికి తెరలేపారని అన్నారు. కుల, మత వివక్షకు తావులేని సమాజం కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం, మానవ గౌరవం కల్పించిందని, ఈ విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.దేశం అభివృద్ధి వైపు ముందుకు సాగుతున్న సమయంలో కుల వివక్ష, అంటరానితనం వంటి తిరోగమన ఆలోచనలను ప్రోత్సహించడం దురదృష్టకరం. భారతదేశంలో ప్రతి పౌరుడూ సమానమే. ఎవరి కులం, మతం, సామాజిక నేపథ్యం ఆధారంగా వారిని తక్కువ చేసి చూడటానికి ఎవరికీ హక్కు లేదు" అని స్పష్టం చేశారు.సామాజిక న్యాయం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, రాజ్యాంగ విలువలకు భంగం కలిగించే ఏ చర్యనైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. మల్లికార్జున ఖర్గే కి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు అయూబ్ తెలిపారు. దేశంలో సామాజిక సామరస్యాన్ని, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో నిరంతరం పోరాడుతామని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా నిలుస్తోందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 14,తరంగాలు** : వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని గౌడ కులస్తులు శుక్రవారం నిర్వహించనున్న కార్తీక మాస వనభోజనాల కార్యక్రమానికి ముందు తమ ఆరాధ్య దైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించి, పట్టు వస్త్రాలు సమర్పించారు.గౌడ కులస్తులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నెలకొనాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థించినట్లు గౌడ సంఘం పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు సమ్మెట సూరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ , మడ్డి రాజయ్య, సమ్మెట సమ్మయ్య, మేడి సురేష్--కళ్యాణి దంపతులు తదితరులు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం గౌడ కులస్తులు వనభోజనాల కార్యక్రమానికి బయలుదేరారు.